
సంపుటి - 7 నవంబర్ - 2023 సంచిక - 03

# జీవస్వరం


ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం............................................3
క్రీస్తు రాజు ......................................................5
పరదైసు .........................................................7
పునీత లూసియమ్మ ..............................................9
బైబిల్ దర్శనం...................................................11
లేయా ............................................................13
శుభవచనం బైబిల్ క్విజ్...........................................15
ఇంద్రధనుస్సు....................................................17
ఏంజెల్స్ కార్నర్...................................................18
యువ స్పందన ....................................................19
బైబిల్ దృశ్యమాలిక.............................................21
శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు..........................23









**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో ఫాదర్ ఎబిన్

Mr. M. సత్యం సిస్టర్ క్రిస్టీన CMC

Mrs. K. శ్రీలత Mr. J. లూర్థు స్వామి

**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**

**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**మీరు చేసిన పనులను,**


**తోడి సోదరులకు మీరొనర్చిన,**

**ఒనర్చుచున్న సహాయముల ద్వారా**

**ఆయన యందు మీరు ప్రదర్శించు ప్రేమను**

**ఆయన మరచిపోడు**

**(హెబ్రీ 6,10)**



# తండ్రి గారి సందేశం....



## హృదయ పరివర్తనం - దైవ రాజ్య ప్రవేశం

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

దైవ రాజ్యములో ప్రవేశించాలంటే హృదయ పరివర్తనం చెంది సువార్తను విశ్వసించాలని యేసు ప్రభు బోధిస్తున్నాడు. "కాలము సంపూర్ణమైనది. దేవుని రాజ్యము సమీపించినది. హృదయ పరివర్తనము చెంది, సువార్తను విశ్వసింపుడు" (మార్కు 1,15). హృదయ పరివర్తనం అంటే ఏమిటి అని ధ్యానిద్దాం.

హృదయ పరివర్తనం చెంది దేవుని వైపు మరలి రావాలని ప్రవక్తలు బోధించారు. హృదయ పరివర్తనం అనే పదానికి హీబ్రు భాషలో ఉపయోగించిన పదం ''షుబ్''. ఈ పదం ఉపయోగించడం ద్వారా యిస్రాయేలు ప్రజలు తమ దేవుడైన యావే వద్దకు తిరిగి రావాలని ప్రవక్తలు కోరుకున్నారు. దేవుని ఆజ్ఞలకు వ్యతిరేకంగా జీవించి దేవునికి దూరమైన యిస్రాయేలు ప్రజలు దేవుని వద్దకు తిరిగి రావాలని ప్రవక్తలు బోధించారు. ఈ "తిరిగి రావడం" అనే పదంలో రెండు అర్థాలు ఉన్నాయి. మొదటిది, బాహ్యమైన తిరిగి రావడం. బాహ్యమైన "తిరిగి రావడం"లో కన్నీరు కార్చడం, ఉపవాసం, బూడిదలో కూర్చోవడం, గోనె సంచి ధరించడం వంటివి ఉన్నాయి. అంతర్గతమైన "తిరిగి రావడం" అంటే మనస్సు మార్చుకోవడం లేక సరికొత్త మనస్సును పొందడం. అదే విధంగా, బప్తిస్మమిచ్చు యోహాను హృదయ పరివర్తనం గురించి ప్రసంగించాడు. "పరలోక రాజ్యము సమీపించినది. మీరు హృదయ పరివర్తనం చెందుడు". (మత్తయి 3,2) తప్పు చేసి హృదయ పరివర్తనం పొందడం అంటే ఆ తప్పు నుండి దూరంగా తొలగిపోవడమే కాదు మంచిని చేయడం కూడా దానిలో భాగమే. హృదయ పరివర్తనం ఒక వ్యక్తిని సరికొత్త మంచిదైన జీవన శైలిని పొందుకోవాలని ప్రేరేపిస్తుంది. మనం తప్పు దారిలో నడుస్తున్నామని తెలుసుకున్నట్లయితే, ఆ దారి నుంచి ప్రక్కకు తొలగి మంచి దారిలో నడవడమే హృదయ పరివర్తన.

ఈ రెండు అర్థాలను యేసు ప్రభు తన ప్రసంగాల ద్వారా బోధించాడు. కానీ, రెండవ అర్థానికి ఆయన అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. బాహ్యమైన హృదయ పరివత్తనం (కన్నీరు కార్చడం, ఉపవాసం మొదలైనవి) అంతర్గతమైన పరివర్తనాన్ని ప్రతిసారీ ప్రతిఫలించలేదు. అందుకనే బాహ్యమైన హృదయ పరివర్తన క్రియలను ఎక్కువగా ప్రోత్సహించడం లేదు. బప్తిస్మమిచ్చు యోహాను కూడా దీనినే బోధిస్తున్నాడు. సంపూర్ణమైన హృదయ పరివర్తనం అంటే పశ్చాత్తాపపడి ప్రభువు వద్దకు తిరిగి రావడం. దేవుడు మనలను ఎంతగానో ప్రేమిస్తున్నాడని తెలుసుకొని ఆ ప్రభువు

ప్రేమ నుండి దూరంగా వెళ్ళామని గ్రహించడం హృదయ పరివర్తనలో ముఖ్యమైనది. తప్పిపోయిన కుమారుని కోసం ఎదురుచూస్తున్న తండ్రిలాగా మన మనం ఆయన వద్దకు తిరిగి రావాలని దేవుడు ఎదురు చూస్తున్నాడు.

దేవుని రాజ్యంలో ప్రవేశించాలంటే హృదయ పరివర్తనం తప్పని సరి అని యేసు బోధిస్తున్నాడు. అదే విధంగా సువార్తను విశ్వసించాలని ఆయన నేర్పిస్తున్నాడు. దేవుని వద్దకు తిరిగి రావాలంటే హృదయ పరివర్తనం చెంది సువార్తను విశ్వసించాలి.

హృదయ పరివర్తనం ఒక వ్యక్తి జీవితాన్ని సమూలంగా మార్చివేస్తుంది. హృదయ పరివర్తనం మనలందరిని క్రీస్తునందు నూతన జీవితానికి నడిపిస్తుంది. ఈ క్రొత్త జీవితం మనం తీసుకునే ప్రతి నిర్ణయంలోను, మనం చేసే ప్రతి పనిలోను ప్రతిబింబిస్తుంది, ప్రతిబింబించాలి.

హృదయ పరివర్తనం అంటే చీకటి నుంచి వెలుగులోనికి, మరణం నుంచి జీవానికి, లోకం నుండి దేవుని వద్దకు చేసే ప్రయాణం. పునీత పౌలు గారి ప్రకారం హృదయ పరివర్తనం అంటే "నూతన సృష్టిగా" మారడం. (2 కొరింతీ 5,17) ఒకరు క్రొత్త సృష్టిగా మారాలంటే అతడు "క్రీస్తు నందు" ఉండాలని పునీత పౌలుగారు మనకు నేర్పిస్తున్నారు. (2 కొరింతీ 5,17) "మీ పూర్వ జీవితపు ప్రాత స్వభావమును మార్చుకొనుడు. ఆ పూర్వపు జీవితము మోసకరమగు దుష్టవాంచలచే భ్రష్టమైపోయినది. మీ మనస్తత్వమును నూతనత్వము గావించుకొనుడు. సత్యమైన నీతిని, పరిశుద్ధతను కలిగి దేవుని పోలికగా సృజింపబడిన క్రొత్త స్వభావమును ధరింపుడు" (ఎఫెసీ 4,22-24).

ఈ విధమైన హృదయ పరివర్తనం ద్వారా మనం దేవుని రాజ్యంలో ప్రవేశించడానికి అర్హతను పొందుకుంటాము.

బాహ్యమైన హృదయ పరివర్తన క్రియలకు క్రైస్తవ విశ్వాస జీవితంలో విలువ ఉన్నప్పటికీ అంతర్గతమైన హృదయ పరివర్తనమే యేసు ప్రభువు కోరుకునేది. అందుకనే మారు మనస్సు పొంది మన తండ్రియైన దేవుని వద్దకు తిరిగి వద్దాం. ఆయన ప్రేమ నుండి దూరంగా వెళ్ళకుండా, ఆయన ప్రేమను అర్థం చేసుకొని ఆయన యందు జీవితాన్ని కొనసాగిద్దాం. దేవునికి తగిన బిడ్డలుగా ఈ లోకంలో జీవిద్దాం.

దేవుడు మనలందరిని దీవించును గాకా! ఆమెన్.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# క్రీస్తు రాజు

1. "ఈ మహిమాన్వితుడైన రాజు ఎవరు? ఆయన సైన్యములకు అధిపతియైన ప్రభువు, మహిమాన్వితుడైన ప్రభువు అయనే" (కీర్తన 24,10).

2. "నా రాజువైన ప్రభూ! నేను నీ మహాత్మ్యమును స్తుతింతును. నీ నామమును సదా సన్నుతింతును" (కీర్తన 145,1).

3. "ఆ నావలలోని త్రాళ్లు వదులుగా ఉన్నవి, వానిలోని కొయ్యి స్తంభములను స్థిరముగా నిలబెట్టలేకున్నారు, తెరచాపలు ఎత్తలేకున్నారు" (యెషయా 33,22).

4. "ఇతడు యూదుల రాజు యేసు' అను నిందారోపణ ఫలకమును ఆయన తలకు పై భాగమున ఉంచిరి" (మత్తయి 27,37).

5. "అమరుడును, అగోచరుడును, నిత్యుడును, రాజునగు ఏకైక దేవునకు కల కాలము గౌరవము, మహిమ కలుగును గాక! ఆమెన్" (1 తిమోతీ 1,17)

6. "ప్రభువు లోకమంతటికి రాజగును. ఎల్లరు ఆయనొక్కనినే ప్రభువుగా అంగీకరింతురు. ఆయన నామమును ప్రభువు అనునది ఒక్కటియే" (జెకర్యా 14,9).

7. "హేరోదు రాజు పరిపాలన కాలమున యూదయా సీమయందలి బెత్లేహేము నందు యేసు జన్మించెను. అప్పుడు జ్ఞానులు తూర్పు దిక్కు నుండి యెరూషలేమునకు వచ్చి, యూదుల రాజుగా జన్మించిన శిశువెక్కడ? ఆయన నక్షత్రమును తూర్పు దిక్కున చూచి మేము ఆరాధింప వచ్చితిమి" (మత్తయి 2,1-2).

8. “అచటి రోగులను స్వస్థపరచి దేవుని రాజ్యము మీ సమీపమునకు వచ్చినదని చెప్పుడు” (లూకా 10,9)

9. “ఇప్పుడు నెబుకద్నెసరునైన నేను పరలోక రాజును స్తుతించి, కీర్తించి, కొనియాడుచున్నాను. ఆయన కార్యమునెల్ల యుక్తమైనవి. న్యాయమైనవి. ఆయన గర్వాత్ముల గర్వము నణచును” (దానియేలు 4,37).

10. “మనకొక శిశువు జన్మించను. మనమొక కుమారుని బడసితిమి. అతడు రాజ్య భారము వహించును. ‘ఆశ్చర్యకరుడైన సలహాదారుడు, బలాఢ్యుడైన దేవుడు, శాశ్వతుడైన జనకుడు, శాంతి కరుడైన రాజు’ అని అతడికి పేరిడుదురు”
(యెషయా 9,6).

11. “ఆ దినమున ఈషాయి వంశమున పుట్టిన రాజు జాతులకు ఆకర్షణీయమైన చిహ్నముగా ఉండును, జాతులతని చెంతకు వచ్చును. అతని నగరము ఖ్యాతిని బడయును” (యెషయా 11,10).

12. “అతడు ఒక ప్రవక్తయై ఉండి తమ వంశస్థులలో ఒకని రాజుగా చేయుదునని, దేవుడు చేసిన వాగ్దానమును ఎరిగి యుండెను”
(అపోస్తలుల కార్యములు 2,30).

13. “సియోను కుమారీ, భయపడకుము. ఇదిగో! నీ రాజు నీ యొద్దకు వచ్చుచున్నాడు. గాడిదపిల్లపై కూర్చుండి వచ్చుచున్నాడు” (యోహాను 12,15).

14. “శ్రీమంతుడు, ఏకైక పరిపాలకుడు, రాజాధిరాజు, ప్రభువులకు ప్రభువు అగు దేవునిచే యుక్త కాలమున ఆయన దర్శనము సంభవమగును” (1 తిమోతీ 6,15).


15. “వారు గొఱ్ఱెపిల్లతో పోరాడుదురు. కాని గొఱ్ఱెపిల్ల వారిని ఓడించును. ఏలయన ఆయన ప్రభువులకు ప్రభువు, రాజులకు రాజు, అతనితో ఉన్నవారు పిలువబడినవారు, ఎన్నుకొనబడిన వారు, విశ్వాస పాత్రులు”. (దర్శన గ్రంథము 17,14).

16. “రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు అని పేరు ఆయన దుస్తులపైన, ఆయన తొడపైన వ్రాయబడి ఉండెను” (దర్శన గ్రంథము 19,16).

17. “ప్రభువు ఇట్లనుచున్నాడు: బెత్లెహేము ఎఫ్రాతా! నీవు యూదా నగరములలో మిక్కిలి చిన్నదానవు. కాని యిస్రాయేలు పాలకుడు నీ నుండియే ఉద్భవించును. అతని వంశము పురాతన కాలముకు చెందినది” (మీకా 5,2)

18. “ప్రభువు ఇట్లనుచున్నాడు: నేను దావీదు వంశము నుండి నీతిగల రాజును ఎన్నుకొను రోజులు వచ్చుచున్నవి. రాజు విజ్ఞానముతో పరిపాలించును. దేశమందంతట నీతి న్యాయములు నెలకొల్పును” (యిర్మీయా 23,5).

19. “సియోను కుమారీ! నీవు మిగుల సంతసింపుము. యెరూషలేము కుమారీ! నీవు ఆనందనాదము చేయుము. ఇదిగో! నీ రాజు నీ చెంతకు వచ్చు చున్నాడు. ఆయన విజయుడు, జయశీలుడై విజయము చేయును. కాని వినయాత్ముడై గాడిదపై ఎక్కివచ్చును, గాడిద పిల్లపై ఎక్కివచ్చును” (జెకర్యా 9,9)




# పరదైసు (2వ మాట)

సిలువలో యేసు ప్రభువు పలికిన రెండవ మాటను ధ్యానించుకుందాం (లూకా 23,43) ఇది మనకు చాలా చిర పరచితమైన వాక్యభాగం. కాని, వాక్యం యొక్క లోతుల్లో వెళ్ళి ధ్యానించినప్పుడే ఆ వాక్యం యొక్క అర్థాన్ని మనం గ్రహించగలుగుతాము. వాక్యాన్ని హృదయంలో దాచుకున్నప్పుడు మాత్రమే మనం దాన్ని పాటించగలుగుతాం. పాటించని పఠన పనికి మాలినది అంటే నిష్ప్రయోజనమైనది. అందుకని పాటించడం కోసం పఠించాలి. అప్పుడే అది తగిన ఫలా పాటించడం కోసమే మనం పఠించాలి. అప్పుడే అది తగిన ఫలాన్ని ఇస్తుంది. బైబిల్ పారాయణం ఎప్పుడు కూడ పాటించడంతోనే అది ముగించబడాలి. ఈ రెండవ మాట మనకు మోక్షం గురించి కీలక విషయాలు అందిస్తుంది. పరలోకం గురించి అన్ని మతాలు చెబుతాయి కాని ఇంత కచ్చితమైనటువంటి, నిర్దిష్టమైనటువంటి, నిర్ణయ యాత్మకమైనటువంటి, నిశ్చయతతో కూడినటువంటి మాట మనకు వేరే మతాల్లో కన్పించదు. మనం ఈ సన్నివేశాన్ని చూస్తే తప్పు పట్టజాలని, పాపం అంటుకోని, తలంపుల్లో సయితం పాపం లేనటువంటి ఓ వ్యక్తిని చూస్తున్నాము. ఇరువురు కరుడుగట్టిన నేరుస్థుల మధ్యలో ఆయన సిలువ వేయబడ్డాడు. ఇదే వైవిద్యం యెషయా ప్రవక్త లేఖనాల్లో చెప్పినట్లు “ఆయన అతిక్రమంలో ఒకడిగా యెంచబడతాడు'' అని. ఆయన ఈ లోకంలో

ఉన్నప్పుడు కూడ పాపుల మధ్యలో నివసించాడు. అసలు ఆయన సిలువ వేయబడిన విధానం చూసినప్పుడే మనకు ఒక విషయం అర్థం కావాలి. ఆయన నరావతారం ద్వారా ఈ లోకానికి వచ్చి మనలో ఒకడై పోయాడు. పాపుల్ని రక్షించడం కోసం ఒక పరమ పరిశుద్ధుడు పాపుల స్థాయికి దిగిపోవడం. పాపులతో మమేకమైపోవడం. యేసు ప్రభువు యొక్క మాటల్ని ధ్యానించక ముందు మన మొకటి అర్థం చేసుకోవాలి. ఇద్దరి దొంగల మధ్యలో ఒక నేరస్థుడిగా యెండబడ్డాడు. చాలా సార్లు మనం పరువుకోసం, ప్రతిష్ట కోసం ప్రాకులాడి పోతాము. మన వీదిలో ఒక పరువు లేని వ్యక్తితో ఎప్పుడైన మనం మాట్లాడామా? ఒక (త్రాగుబోతు బుజం మీద చేయి వేసుకొని ఆయనను ఇంటిదాకా దిగబెట్టామా?) కనీసం వాడు మన వీదిలో పడిపోయి ఉంటే వాళ్ళబ్బాయిని పిలిచి చెప్పామా? ఆయన పాపులతోను, సుంకరులతోను సహపంక్తి భోజనం చేశాడు. మన కన్నా చిన్నవాళ్ళతో, వాళ్ళ స్థాయికి వెళ్ళడానికి మనం ఇష్టపడము. మన కంటే క్రింది స్థాయిలో ఉన్న వాళ్ళతో మనం "ఐడెంటిఫై" అవ్వడం. చాలా ప్రాముఖ్యం. సిలువ వేయబడిన క్రీస్తు నేర్పించే పాఠం ఇది. అక్కడి నుండి ముందుకు వెళ్ళి మనం విశ్లేషణ చేస్తే యేసు ప్రభు ఎంత అధికారంతో మాట్లాడుతున్నారు మనకు అర్థంమవుతుంది ఒక లోక రక్షకుడు తప్ప మరెవ్వరూ అలా మాట్లాడలేరు. "నిశ్చయముగా చెబుతున్నాను" అంటే అది "ఖచ్చితం" ఒక పొల్లైనపోదు. ఏ అవతార పురుషుడు, ఏ ప్రవక్త ఇంత కచ్చితంగా చెప్పలేరు. "ఈ నామమున తప్ప మరే నామమున తప్ప మరే నామమున రక్షణ కలగదు" అందుకే ఆయన అంత కచ్చితంగా చెప్పగలరు.

**(ఇంకా ఉంది)**

లూర్థుస్వామి,
బెల్లంపల్లి

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త

2022 బైబిల్ క్విజ్ సిరీస్‌ను మనం పూర్తి చేసుకున్నాము. ఇక ఫిబ్రవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభిస్తున్నాము.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.

2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ।। 10,000/–లు, రెండవ బహుమతి రూ।। 8,000/–లు, మూడవ బహుమతి రూ. 6,000/– సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**



## పునీత లూసియమ్మ

### (కన్య, వేదసాక్షి, సిరకూసె, సిసిలీలకు పాలక పునీతురాలు, కంటి వ్యాధిగ్రస్తుల సంరక్షక పునీతురాలు క్రీ॥శ॥ 283 – 304)

పునీత లూసియమ్మ గారి పండుగ రోజున ప్రభు మార్గాన నడువ తమకు 'వెలుగు' చూపుమని ఆ యమ్మకు భక్తులు కోరుతుంటారు. శారీరకంగాను, ఆధ్యాత్మికంగాను తాము అంధులుగా మిగిలిపోకుండా మార్గదర్శకత్వం వహింపుమని, మంచి దృష్టితో ముందుకు సాగునట్లు తమ కొరకు దేవుని ప్రార్థింపుడని భక్తులు అర్థిస్తుంటారు. లోకాశలు, తప్పుడు నినాదాలు, చెడ్డదృశ్యాల వలలో చిక్కుకొనకుండ కాపాడుకొనుటకు విశ్వాసులు లూసియమ్మ గారి మధ్యవర్తిత్వాన్ని కోరుకుంటారు. ఆయమ్మ పలికినట్లు "క్రియాశీలకంగా ప్రవర్తించండి. గాలిలో ఎగిరే పక్షి చేసే వాగ్దానాలు విని మోసపోకండి. నేల విడిచి సాముచేయకండి. ఈ లోకంలో మీ జీవితం శాశ్వతంకాదు కదా!" అనే మాటలను జ్ఞాపకపర్చుకుంటారు.

పునీత లూసి గారిది గ్రీకు వంశం. ధనిక కుటుంబంలో పుట్టారు. 'సిసిలీ' ద్వీపకల్పంలో 'సిరకూసె' నగరంలో క్రీ॥శ॥ 283లో ఉద్భవించారు. వీరికి లూసి అని పేరు పెట్టబడింది. లక్స్ అనబడే లాటిను పదానికి సమానార్థం 'వెలుగు' అనే సార్థక నామధేయురాలు వీరు. పసి ప్రాయంలోనే తండ్రి చనిపోగా తల్లి యుతీబియా పెంపకంలోనే పెరిగారు. ఆ రోజుల్లో ఆడపిల్లలకు చిన్న ప్రాయంలోనే నిశ్చతార్థం జరిపించి పెండ్లీడు వచ్చాక కళ్యాణం జరిపించేవారు. అలాగే లూసియమ్మకు ఒక ధనిక కుర్రాడితో పెండ్లి జరిపించాలని తల్లికోరిక. బలవంతంగా నిశ్చితార్థ కార్యక్రమం జరిపించింది. కన్యగా దేవునికి అర్పించుకోవాలన్న ఆ యమ్మ కొర్కెకు గండిపడింది.

అయితే ఆ యువకుడు క్రైస్తవేతరుడు. దియోక్లేషియన్ చక్రవర్తి క్రైస్తవ వ్యతిరేక పవనాలు తీవ్రంగా వీస్తున్న రోజులవి. అయినా పునీత సెసీల్యమ్మగారిలా తాను ప్రయత్నించి తనకు కాబోయే భర్తను తన దారికి తెచ్చుకోవాలని లూసీ భావించారు. ఇది ఇలా ఉండగా, లూసియమ్మగారి తల్లి యుతీబియాకు చాలా కాలం నుండి రక్తస్రావ రోగం బాధిస్తూ ఉంది. ఈ సందర్భాన్ని లూసి వినియోగింప తలంచారు. తాము ఉంటున్న సిరూకూసె పట్టణంకు 50 మైళ్ల దూరంలో కతానియ పట్టణంలో (సిసిలీ దేశంలోనే) పునీత అగత (ఫిబ్రవరి – 5 చూడండి) గారి సమాధి ఉంది. అక్కడ అద్భుతాలు స్వస్థతలు కోకొల్లలుగా నెరవేరుతున్నాయి.

ఈ విషయాన్ని లూసీగారు తల్లికి వివరించి అక్కడికి ప్రయాణానికి పురమాయించారు. అగతగారి సమాధిని దర్శించి ప్రార్థింపగా తల్లి యుతీబియాకు పూర్తి ఆరోగ్యం, శాంతి లభించింది. అందువల్ల ఆనందపడింది. బిడ్డ మాటలపై గురి ఏర్పడింది.

గతంలో లూసీగారు తమ తల్లిని అడుగుతూ ఉండేవారు. తమకుగల అపారమైన ఆస్థిలో తనవాటాకు వచ్చే ఆస్థిని అమ్మి పేదలకు పంచాలని తల్లికి స్వస్థత చేకూరిన సందర్భంగా దేవునికి ధన్యవాదాలు తెల్పుటకు కొంత ఆస్థిని ఈ సందర్భంలో పంచడానికి తల్లి సమ్మతించింది. అయితే వీరి ఆస్థికోసం ఆశపడి లూసీ గార్ని వివాహమాడ నిశ్చతార్థమైన యువకుడు ఆస్థిని దిక్కుమాలిన వారికి దానాధర్మం చేయడానికి తీవ్రంగా వ్యతిరేకించాడు. గవర్నరుకు పిర్యాదు చేశాడు.

గవర్నరు ఆ తల్లీ కూతుర్లకు హెచ్చరిక చేశాడు. అనేక ఆటంకాలు కలిగించాడు. బాధలు పెట్టాడు. మరో ప్రక్క దియోక్లేషియను చక్రవర్తి వేద హింసలు కొనసాగుతూనే ఉన్నాయి. రోమన్ దేవతలనే ప్రజలు ఆరాధించాలని కలసి మెలసి జీవించాలని చక్రవర్తి శాసనం. దేశభక్తులు, ధనికులైనా సరే క్రైస్తవ మతావలంబన తన రాజ్యంలో నిషిద్ధమని ఆచరణ, ప్రచారం కూడదని ఆజ్ఞ జారీచేశాడు. లూసీగారు ఇందుకు గట్టిగా వ్యతిరేకించారు. వ్యక్తి స్వేచ్ఛకు ఇష్టానికి చక్రవర్తి అడ్డు చెప్పడం విడ్డూరమని నుడివారు. పైగా అన్య దేవతలను పూజించడం వల్లకాదని విముక్త యేసు క్రీస్తు ప్రభువును విడిచి పెట్టేదిలేదని నిక్కచ్చిగా ప్రకటించారు.

లూసియమ్మ గారిని వేశగృహానికి తరలింపమని గవర్నరు తాఖీదు జారీచేశాడు. ఎంత ప్రయత్నించినా ఆ యమ్మ నిలబడ్డ చోట నుండి కదలించడం బలమైన భటులవల్ల కాలేదు. ఆమె అందమైన జ్యోతిర్మయ కండ్లు దేవునివైపే నిలబడ్డాయి. ఆమెను కాల్చి చంపాల్సిందిగా మరో ఆజ్ఞ జారీ చేయబడింది. కాని మంటలు ఆ పవిత్రురాలిని తాక లేకపోయాయి. పిమ్మట పదునైన ఒక బాకును ఆయమ్మ గొంతులో దూరే విధంగా బలంగా పొడవబడటంతో ఆ కన్య తన అంతిమ శ్వాస విడిచారు. ఇది క్రీ॥శ॥ 304లో జరుగుగా ఎందరో విశ్వాసులకు ఆదర్శ ప్రాయమైంది.

ఆరవ శతాబ్దంలో రోమునగరంలో భక్తులు లూసియమ్మ ఒక పవిత్ర కన్య వేదసాక్షియని కొనియాడుచుండగా శ్రీసభ పూజల్లో ఆయమ్మ పేరు ఉచ్చరింపబడునట్లుగా శాసించింది. పోపు గ్రెగోరి ది గ్రేట్ గారు ఆయమ్మ పరిశద్ధత, ఘనత గూర్చి తమ లేఖలో ఎంతగానో శ్లాఘించారు. ఆ పవిత్రురాలిని సిరకూసె నగరం. సిసిలీ ద్వీపకల్పంకు, కంటి, గొంతు, రక్తస్రావ వ్యాధిగ్రస్తులకు పాలక పునీతురాలిగా శ్రీసభ నియమించింది. లూసి అనగా జ్యోతి, వెలుగు, ప్రకాశం అని అర్థం.

**ధ్యానాంశం :-**

**పవిత్ర హృదయాలు పవిత్రాత్మ దేవాలయాలు**




(గత సంచిక తరువాయి భాగం)

**6.12 దృష్టి దానము 10:46-52**

యేసు శ్రమల ప్రస్తావనలోని అంతర్యమును గ్రహించక, కుడి ఎడమల స్థానములకై పోట్లాడిన శిష్యులకు బుద్ధివికాసం కలుగునట్లు తనరాకలోని ఆంతర్యం వివరించి వారి కన్నులు తెరిపించాడు. దీనిని వెంటనే గ్రుడ్డివానికి చూపును ప్రసాదించు అద్భుతమును రాయుట ద్వారా మార్కు మరింత తేటతెల్లం చేశాడు. ఈ గ్రుడ్డివాడు యేసు నందు విశ్వాసముకు ప్రతీకగా ఉన్నాడు. జనులు మందలిస్తున్నను బిగ్గరగా కేకలు వేస్తూ యేసును దృష్టిని ప్రసాదించమని ప్రార్థించాడు. ఇది గ్రుడ్డివానికి యేసు నందు ఉన్న గాఢ విశ్వాసాన్ని తెలుపుతుంది. కన్నులు లేకపోయినను, గ్రుడ్డివాడు యేసును దావీదు కుమారునిగా ('మెస్సయా' దావీదు కుమారుడు) బోధకుడిగా గుర్తించాడు. కనులుండియు శిష్యులు, ప్రజలు యేసు ఎవరో గ్రహించలేకపోయారు. దృష్టి పొందిన గ్రుడ్డివానిని యేసు పోయిరమ్మని చెప్పినా కూడా యేసునే అనుసరించాడు. శిష్యుడు ఎలా ఉండాలో చూపించాడు. దైవజ్ఞానంలో ఒక వ్యక్తి ఎదిగినకొలది ఆ వ్యక్తి మరింత చేరువగా యేసును అనుసరించాలి, వెంబడించాలి.

**7. యెరూషలేములో యేసు 11:1-13:37**

ఈ విభాగంలో యేసు యెరూషలేములో ప్రవేశించుట నుండి, దేవాలయపతనం, మహాపద్రవముల ప్రవచనం వరకు గమనిస్తాం! యెరూషలేంలో పరిసయ్యులు ప్రధానార్చకులు, ధర్మశాస్త్ర బోధకులు యేసుతో అనేక విషయములపై

వాగ్వివాదం చేస్తూ ఆయనను శ్రమల సిలువవైపు పయనింపజేయుటను చూస్తాం!

### 7.1 యేసు యెరూషలేం ప్రవేశం 11:1-11

గలిలియా నుండి ప్రారంభమైన యేసు సుదీర్ఘ, కష్ట ప్రయాణం యెరూషలేం ప్రవేశంతో ముగుస్తుంది. పయనం, ప్రయాణం అలసట, కఠినంతో కూడిన దైనను, ప్రవేశం ఉత్సాహం, ఉల్లాసంతో కూడుకున్నది. తాను శ్రమల, సిలువ మరణం అనుభవించబోతున్న యెరూషలేంలోనే యేసు ఈ ఉత్సాహపూరిత ప్రవేశం చేసారు. రానున్న ఇశ్రాయేలీయుల రక్షక ప్రవక్త ఈయనేనని సూచిస్తుంది. జెకర్యా ప్రవక్త ప్రవచించిన రానున్న రాజు ఈ యేసే. "సియోను కుమారీ! నీవు మిగుల సంతసింపుము. యెరూషలేము కుమారీ! నీవు ఆనందనాదం చేయుము. అదిగో! నీ రాజు నీ చెంతకు వచ్చుచున్నాడు. అతడు జేతయు జయశీలుడునై విజయము చేయును. కాని వినయాత్ముడై గాడిదపై ఎక్కివచ్చును. గాడిదపిల్లపై ఎక్కివచ్చును" (జెకర్యా 9,9).

జకర్యా నుడివినట్లు గాడిదపిల్లపై వినయాత్ముడై వచ్చుచున్న రాజును చూసి యెరూషలేము నిజముగానే ఆనందనాదం చేసినది. ప్రజలు తమ వస్త్రములు, చెట్ల రెమ్మలు పరచి "జయము! ప్రభువు పేరిట వచ్చువాడు, స్తుతింపబడునుగాక!" అని విజయధ్వానం చేశారు. వినయాత్ముడై గాడిదపిల్లపై వచ్చు యేసు దేవుని యందు విశ్వాసమున్న వారికి మెస్సయాగా, క్రీస్తుగా బహిర్గతమగు తున్నాడు. కాని మెస్సయాను తమ రాజ్యములను సుస్థిరము చేయు గొప్పరాజుగా, డాంభికమైన వానిగా ఎదురుచూచే వారికి యేసే మెస్సయా అన్న మర్మం మరుగు పరచబడినది.

### 7.2 అంజూరపు చెట్టు-యేసు శాపం .. దేవాలయ ప్రక్షాళన 11:12-26

యేసు అంజూరపు చెట్టును శపించుట వింతగానే కన్పించును. ఎందువలననగా! అది పండ్లకాలము కాకపోయినను యేసు ఆ చెట్టుకు పండ్లు లేవని శపించాడు. ఈ చెట్టును శపించటాన్ని మనం రెండు కోణాలలో చూడగలం. మొదటిది, పాతనిబంధనలో అంజూరపు చెట్టు ఇశ్రాయేలు ప్రజలకు సూచకంగా ఉన్నది (హోషేయ 9,10). కావున యేసు అంజూరపు చెట్టును శపించుట ఇస్రాయేలీయులపై యేసు కోపమునకు సూచకంగా భావించవచ్చును. ఎందువలనంటే వారు ఎన్నుకోబడిన జాతియైనను యావే కోరుకున్న జీవితమును జీవించలేదు. ముఖ్యంగా యేసును క్రీస్తుగా గుర్తించి అంగీకరించలేదు. రెండవది, యేసు అంజూరపు చెట్టును శపించుట దేవాలయం శుభ్రపరచుటతో ముడిపడి ఉండుట గమనిస్తాం! ఈ రెండు సంఘటనలలో కూడా యేసు తాను కోరుకున్న విధముగా లేనందున కోపించటను గమనించగలం. దేవాలయంలో వ్యాపారం చేస్తున్న వారిని వెడలగొట్టాడు. దేవాలయమున ప్రార్థనాలయముగా గాకుండ దొంగలగుహగా మార్చారు (యిర్మీయా 7:11). యేసు దేవాలయమును అన్ని జాతుల ప్రార్థనాలయముగా ఆశించారు (యెషయా 56:7). యేసు శాపవచనములతో ఎండిన అంజూరపు చెట్టు యేసు కాలంలో ఫలహీనమైన యూదుల దేవాలయపు భక్తని సూచిస్తుంది.



# లేయా

లేయా లాబాను పెద్ద కూతురు, రాహేలు అక్క. పరిశుద్ధ గ్రంథ కర్త. "లేయా బలహీనమైన కండ్లు కలది" (ఆది 29,17) అని ఆమెను పరిచయం చేస్తున్నాడు. ఈ వాక్యం ఆమె దీనమైన పరిస్థితిని మనకు తెలియ జేస్తుంది. తన చెల్లెలి లాగా ఆమె అందగత్తె కాదు. లేయా చెల్లెలైన రాహేలు అందెగెత్తె, అంగ సౌష్టవం గల రూపవతి, ఆకర్షణీయమైన యువతి. లేయాను, రాహేలును చూసిన ప్రతి ఒక్కరు లేయా కన్న రాహేలు అందెగత్తె అని పొగుడుతారు. రాహేలుకు దొరికినంత సులభంగా లేయాకు పెళ్ళి సంబంధం దొరకడం కష్టం అని లేయా తండ్రికి తెలుసు. అందుకే, లాబాను పన్నిన కుట్రలో యాకోబు రాహేలుకు బదులుగా లేయాను స్వీకరించాల్సి వచ్చింది. తాను మోసపోయానని తెల్సుకున్న యాకోబు లాబానుతో వాగ్వాదానికి దిగాడు. ఇది అంతా గమనిస్తున్న లేయా అవమానానికి గురై ఉండవచ్చు. తనను స్వీకరించడానికి యాకోబుకు ఇష్టం లేదు అని లేయాకు అర్థమైంది. కానీ ఆమె ప్రతి ఘటించలేదు. ఎందుకంటే ఆమెను వివాహమాడడానికి ఎవరు సిద్ధంగా లేరు.

తండ్రి చేత, భర్త చేత, చెల్లెలి చేత నిరాదరణకు గురైన లేయా తన హక్కుల కొరకు పోరాడింది. యాకోబు భార్యగా, తనకు తన కుటుంబంలో గౌరవం దక్కటం లేదని ఆమె తెల్సుకుంది. ఈ అవమానాన్ని , తిరస్కరణను ఆమె ఓర్పుతో సహించింది. తను పొందుకోలేని గౌరవాన్ని, తన పిల్లల ద్వారా పొందుకోవచ్చని ఆమె గ్రహించింది. గొడ్రాలైన ఆమె మొరను దేవుడు ఆలకించాడు. ఆమెకు సంతానాన్ని దయచేసి దీవించాడు. యాకోబుకు ఇష్టమైన భార్యగా గౌరవాన్ని పొందుకున్న రాహేలు గొడ్రాలై ఉండగా, అందరి తిరస్కరణకు గురైన లేయా ఆరుగురు కుమారులు, ఒక కుమార్తెతో దీవించబడింది.

లేయా పిల్లలను కన్న ప్రతీసారి దేవున్ని స్తుతించింది. అంతేకాక, తన కుమారులకు పేర్లు

పెట్టడం ద్వారా ఆమె తన ఆవేదనను చాటి చెప్పింది. తన మొదటి కుమారునికి "రూబేను" (నా బాధను చూచెను) అని పేరు పెట్టింది. తన మూడవ కుమారుడికి లేవి (అంటుకొనుట) అని పేరు పెట్టడం ద్వారా, తన భర్త తనను అంటి పెట్టుకొని ఉంటాడని ఆమె ఆశించింది. నలుగురు కుమారులను కన్న తర్వాత కూడా, యాకోబును కలవడానికి లేయా కష్టపడాల్సి వచ్చింది (ఆది 30,14-16) యాకోబు మరియు రాహేలు లేయాతో ఏ విధంగా ప్రవర్తిస్తున్నది, దీనిని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. కుమారులను కన్న ప్రతిసారీ, తన భర్త తనకు చేరువ అవుతాడని ఎంతగానో ఆశించింది. ఏడుగురిని కన్న తర్వాత కూడా లేయా తిరస్కరణకు గురి అయింది. తన భర్తయైన యాకోబు నుండి ఆమె పొందుకోవాలనుకున్న ప్రేమ ఆమెకు దక్కలేదు. అయినప్పటికి లేయాను దేవుడు సంతానంతో దీవించాడు. "లేయా భర్త ప్రేమకు నోచుకొనక పోవుట చూచి, దేవుడు ఆమె గర్భమును తెరిచెను. రాహేలు గొడ్రాలై యుండెను'' (ఆది 29,31). యిస్రాయేలీయులలో అతిముఖ్యమైన రెండు గోత్రాలకు మూల పురుషులైన లేవీ మరియు యూదా లేయా పుత్రులు. లేవీ, యాజక వర్గంగా పరిగణింపబడిన లేవీ గోత్రానికి మూల పురుషుడు. యూదా, రాచరికపు వర్గంగా పరిగణింపబడి యూదా గోత్రానికి మూల పురుషుడు. రక్షకుని దయచేస్తానన్న దేవుని వాగ్దానం లేయా సంతానం ద్వారా నెరవేరింది. యేసు ప్రభు యూదా గోత్రంలో జన్మించాడు. దేవుని ప్రణాళికలో, దేవుని సమయంలో లేయా కన్నీటి, ఆవేదనకు ఫలితం దక్కింది. యిర్మీయా ప్రవక్త గ్రంథ: మరియు మత్తయి సువార్త రాహేలు ఆర్తనాదాన్ని ఆమె దు:ఖాన్ని వివరిస్తున్నాయి. "రామాయందు ఒక ఆర్తనాదము విననయ్యెను. అది ఒక మహా రోదనము. రాహేలు తన బిడ్డల కొరకై విలపించుచుండెను. వారి మరణము వలన కలిగిన దు:ఖము నుండి ఆమె ఓదార్పు పొందకుండెను అని యిర్మియా ప్రవక్త పలికిన వాక్కు నెరవేరెను (మత్తయి 2,17-18, యిర్మీయా 31,15) ప్రపంచమందంతటికి పరమానందం కలిగించే రక్షకుడైన యేసు ప్రభు, లేయా కుమారుడైన యూదా గోత్రంలో జన్మించాడు. దేవుని ఆలోచనలు, మానవుని ఆలోచనల కంటే భిన్నమైనవి దేవుని మార్గము మరియు ప్రణాళికలు మానవుని ప్రణాళిక కంటే భిన్నమైనవి, గొప్పదైనవి. దేవుడు దీనుల మొరను ఆలకించి వారిని సమృద్ధిగా ఆశీర్వదిస్తాడు.

తండ్రిని మోసగించి దీవెనలు పొందుకున్న యాకోబు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. తను ప్రేమించని లేయా కొరకు ఏడు సంవత్సరాలు కష్టపడాల్సి వచ్చింది. తను ఇతరులను మోసగించాడు కనుకనే యాకోబు మోసగింపబడ్డాడు. అమాయకురాలైన లేయా కఠిన పరీక్షను ఎదుర్కొవలసి వచ్చింది. అయినా దేవుడు ఆమెను సమృద్ధిగా ఆశీర్వదించాడు. అందెగత్తె అయిన రాహేలు, భర్త ప్రేమకు నోచుకున్న రాహేలు రెండవ కుమారుని జననంతో మరణించింది. అంతేకాక, ఆమె మృతదేహ మార్గ మధ్యమున త్రోవ ప్రక్కనే సమాధి చేయబడింది. కానీ ఏడుగురిని కన్న లేయా పితరులతో పాటు సమాధి చేయబడింది. అబ్రహాము, సారా, ఈసాకు మరియు రిబ్కా సమాధి చేయబడిన ఆ స్థలంలోనే సమాధి చేయబడింది (ఆది 49,31).

ఇదంతయు కూడా దేవుడు నిరాదరణకు, తిరస్కరణకు, ప్రేమకు నోచుకొని వారికి ఆశ్రయంగా నిలుస్తాడని, సమృద్ధిగా ఆశీర్వదిస్తాడని లేయా జీవితం మనకు నేర్పిస్తుంది. దిక్కులేని వారికి దేవుడే కదా దిక్కు. మనల్ని ప్రేమించే దేవుడు మన కొరకు ఉన్నాడని గ్రహిద్దాం. ఆ దేవుడు మనలను విడువడు, ఎడబాయడు ఆమెన్.

# శుభవచనం బైబిల్ క్విజ్

**యోహాను సువార్త 1-10 అధ్యాయాలు**

పేరు ........................ఇంటి పేరు........................విచారణ .............................

## 1. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

ఫోన్ నెంబర్.................................

1) యేసు ...................................... ఆమె సహోదరిని ..................................... ప్రేమించెను.

2) నీవు ..................................................... దేవుని మహిమను చూచెదవని నీతో చెప్పలేదా?

3) ఆయన యందు ............................ ఉండెను. ఆ .......................... మానవులకు వెలుగాయెను.

4) పరలోకము నుండి ............................................. తప్ప కాని ఎవడును ఏమియు పొందనేరడు.

5) దేవునికి సంబంధించిన వాడు ........................................................ ఆలకించును.

6) యేసు ............................................................ పర్వతమునకు వెళ్ళెను.

7) కుమారుని విశ్వసించువాడు ......................................................... పొందును.

8) కాని ఆయనను ....................... ఆయన ...................... నెరవేర్చు వానిని ఆయన ఆలకించును.

9) యేసు ........................................... సోలొమోను మంటపమున నడుచుచుండెను.

10) నన్ను అనుసరించువాడు ............................. నడువక ........................... పొందును అనెను.

11) ఏలయన నా శరీరము నిజమైన ............................. నా రక్తము నిజమైన ......................... .

12) నేను ...................................................... పొగడ్తలను ఆశించువాడను కాను.

13) ఈ విధముగా .............................. గలిలీయలోని కానా అనుపల్లెలో తన ............................ అద్భుతమును చేసి, తన మహిమను ప్రదర్శించెను.

14) దేవుడు ........................................ ఎంతో ప్రేమించి తన ఏకైక కుమారుని ప్రసాదించెను.

15) క్రీస్తు అనబడు ................................................ రానున్నాడని నేను ఎరుగుదును.

16) ఇది యేసు యూదయా నుండి గలిలీయాకు వచ్చి చేసిన ...................................... అద్భుతము.

17) ......................................... ఈ పని చేసినందుకు యూదులు యేసును హింసింప మొదలిడిరి.

18) ......................................................... ఏమి చేయునో కుమారుడు దానిని అట్లే చేయును.

19) మీరు ..........................., ......................... చూచిననే తప్ప విశ్వసింపరు అని యేసు పలికెను.

20) యేసు మరల .................................................. పర్వతము పైకి వెళ్లెను.

21) నేను పరలోకము నుండి దిగివచ్చిన ................................................ అని యేసు చెప్పెను.

22) దప్పిక గొనువాడు నా యొద్దకు వచ్చి తన ................................................ తీర్చుకొనును గాక!

23) నేనే ద్వారమును ఎవడేని ......................... ప్రవేశించిన యెడల వాడు .......................పొందును.

24) ......................... జన్మించుటకు పూర్వమే నేను ఉన్నాను అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

25) పండుగ మధ్య రోజులలో ......................................... దేవాలయములోనికి వెళ్ళి బోధింపసాగెను.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ నవంబర్ నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: యోహాను సువార్త 11-21 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు


"వారు గొఱ్ఱెపిల్లతో పోరాడుదురు. కాని గొఱ్ఱెపిల్ల వారిని ఓడించును. ఏలయన ఆయన ప్రభువులకు ప్రభువు, రాజులకు రాజు. అతనితో ఉన్నవారు పిలువబడినవారు, ఎన్నుకొనబడిన వారు విశ్వాసపాత్రులు" (దర్శన 17,14). క్రీస్తు రాజుని మన హృదయములోని రాజుగా ఆహ్వానించుకొని, ఆయన గారి చిత్రాన్ని రంగులమయం చేద్దాం.




**పేరు:..................................వయస్సు........తరగతి........స్థలం....................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ నవంబర్ నెల 25 తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

పిల్లల విషయంలో దేవునికి అత్యంత ప్రేమ మరియు అమితమైన ఇష్టమని గత సంచికలో మనము నేర్చుకున్నాము. బైబిలు గ్రంథములోని బాలలను దేవుడు ఎలా అక్కున చేర్చుకున్నారో మనం తెలుసుకుందామా?

**1. దావీదు (1 సమూవేలు 16,13)**

గొఱ్ఱెలమందలను మేపుతూ సితార వాయిస్తూ పాటలు పాడే బాలుడయిన దావీదు కీర్తనలతో దేవుని స్తుతించేవాడు. ఆ బాలుని స్తుతిగీతాలకు ప్రసన్నుడయిన యావే దేవుడు ఆ బాలుని యిస్రాయేలుల రాజుగా అభిషేకించాడు. ప్రవక్త సమూవేలు తైలపు కొమ్ము పుచ్చుకొని అన్నలెదుట చిన్నవాడైన దావీదుకు అభిషేకము చేసెను.

గొంతెత్తి భక్తితో దేవుని కీర్తనలు పాడుతూ సదా స్తుతి గీతాలను ఆలపించే దావీదును ఎలా అభిషేకించాడో చూశారా! మీరు గొప్పవాళ్ళు అవ్వాలంటే గొంతెత్తి దేవునికి స్తుతి గీతాలు పాడుతు దేవునికి ఇష్టమైన వారిగా జీవించాలి.

**2. యిస్రాయేలు బాలిక (2 రాజు 5:2-14)**

సిరియా రాజు యిస్రాయేలుతో యుద్ధము చేసి వారి బాలికనొకతెను బంధించి తీసుకువెళ్ళారు. ఆ బాలిక సైన్యాధిపతియైన నామానుకు భార్యకు దాసి అయింది. కుష్ఠ రోగముతో బాధ పడుతన్న యజమానుని చూసి ఆ బాలిక యజమానురాలితో మన యజమానుడు సమరీయలోని ప్రవక్త వద్దకు వెళ్ళిన ఎంత బాగుంటుందో కదా అని తన యజమానురాలితో చెప్పింది. ఆ దైవ భక్తుడు యజమానుని వ్యాధి నయము చేస్తాడని చెప్పింది. ఆ బాలిక ప్రేరణతో నామాను వెళ్ళాడు. ప్రవక్త మాట ప్రకారం చేశాడు. సంపూర్ణ స్వస్థత పొందుకున్నాడు.

యిస్రాయేలు బాలికలాగా యేసయ్య గురించి ఆయన శక్తిని గురించి తెలియని వారిని జీవస్వరం స్వస్థతా కూటమునకు ఆహ్వానించాలి. యిస్రాయేలు బాలికలాగా మనం కూడా ప్రతి సంవత్సరం దేవుని జీవస్వరం ఆలకించి సంపూర్ణ విడుదల పొందడానికి మన స్నేహితులను ఆహ్వానిద్దామా!

చిన్నారులూ, పిల్లలంటే యేసయ్యకు ఎంతో ఇష్టం. మనం తల్లిదండ్రులకు లోబడి జీవిద్దాం. దేవునికి ఇష్టమైన మంచి పనులు చేద్దాం. దేవుడు మనలను ఆశీర్వదిస్తాడు.



# సువార్త ప్రబోధము ఎవరు చేయాలి?

పరులను ప్రేమించుట అన్నప్పుడు వర్ణం, వర్గం, జాతి, మతం, ధనిక, పేద, పామర పండితులను బేధం లేకుండా ప్రతి మనిషిని అర్థం చేసుకొని గౌరవించి, అంగీకరించుట మాత్రమేగాక వారి ఆత్మీయ రక్షణ గురించియు అక్కర కలిగి ఉండుట.

ఎవాంజలి, గౌదియం 120లో ప్రాంఛీసు జగద్గురువులు మనకు జ్ఞాపకం చేస్తారు. తాము పొందిన బప్తిస్మపు యోగ్యతను బట్టి దైవ ప్రజలందరును సువార్తా ప్రబోధ ధర్మము కలిగిన క్రీస్తు శిష్యులయ్యారు (మత్తయి 28,19). శ్రీసభలో అనేక మంది విశ్వాసులు, సువార్త ప్రబోధ ఆవశ్యకత గురించి ఈ షణ్మాత్రం ఆసక్తి లేనివారై ఉండగా కేవలం శిక్షణ పొంది నేర్పరులైన కొద్దిమందితోనే ప్రపంచంలో సువార్తా ప్రబోధం గురించి ప్రణాళికలు సిద్ధం చేయుట అసంపూర్ణ కార్యమే అవుతుంది. శ్రీసభలో ఎటువంటి అంతస్థులో ఉన్నను విశ్వాసం ఏ స్థాయిలో ఉన్నను బప్తిస్మం పొందిన వారందరూ సువార్తా ప్రబోధ రాయబారులై ఉన్నారు! తెలియని దేవునికి బలిపీఠము కట్టిన ఏథెన్సు పౌరులతో పౌలు అంటారు. "మీరు ఇప్పుడు ఆరాధించుచున్న ఆ తెలియని దేవుని గూర్చియే నేను మీకు ప్రకటించుచున్నాను. ఆయన కొరకు అన్ని ప్రక్కలను వెదకి ఆయనను కనుగొనుటకై ఆయన ఇట్లు చేసెను. దేవుడు నిజముగా మనలో ఏ ఒక్కరికి దూరముగా లేడు" అని చెప్తూ కడన హృదయ పరివర్తనకై పిలిచి, ప్రపంచము అంతటిని

నీతి ప్రకారము తీర్పు తీర్చు యేసు గురించి ప్రకటించారు (అ.కా. 17,22-31). క్రైస్తవుల్ని హింసించుచున్న పౌలు క్రైస్తవ వ్యాపకుడుగా ఎలా మారాడన్న విషయం ఈ సంఘటన తెలియజేస్తుంది. దేవుని వెదికే స్థాయి నుంచి, క్రీస్తుని లోకానికి అందించు స్థాయికి ఎలా ఒక విశ్వాసి పురోగమస్తాడో తన మాటల్లో స్పష్టం చేశారు పౌలు.

కాబట్టి దేవున్ని నిజాయితీగా వెదకు ప్రతివారు విశ్వాసులవుతారు. విశ్వాసులైనవారు - క్రీస్తుకు శిష్యులవుతారు. క్రీస్తు శిష్యులే - సువార్తికులుగా పరిణతి చెందుతారు. నిజానికి శిష్యరికం, సువార్త ప్రబోధం రెండు కలిసి కొనసాగుతాయి.


## ఆదిలాబాద్ మేత్రాసన రజత జూబిలీ ప్రార్థన


మా ప్రభువైన దేవా! ఆదిలాబాద్ మేత్రాసన రజతోత్సవ సందర్భంలో మేము మీకు వందనములు అర్పిస్తున్నాము. గత ఇరవై నాలుగు సంవత్సరాలుగా మా మేత్రాసనానికి కాపరిగా ఉండి మీ అపారమైన కృపావరమలతో మమ్ము నడిపించినందుకుగాను మీకు స్తోత్రములు. రాబోయే కాలంలో కూడా మా మేత్రాసనాన్ని మీ చిత్తానుసారంగా, మీ మార్గములో నడిపించుమని మిమ్ము ప్రార్థిస్తున్నాము. మేత్రాసన అభివృద్ధి కొరకు శ్రమపడిన వారందరిని, మాకు సహాయం చేసిన దాతలను దీవించండి. మా మేత్రాసనములో సేవలందించి స్వర్గీయులైన గురువులను, అమ్మగార్లను, ఉపదేశులను స్మరించుకుని ప్రార్థిస్తున్నాము.

ఈ రజతోత్సవ సందర్భంలో ఆదిలాబాద్ మేత్రాసనాన్ని ప్రత్యేకంగా మీకు సమర్పించి ప్రార్థిస్తున్నాము. మమ్ములందరిని పవిత్ర పరచి, నూతన అభిషేముతో నింపండి. పీఠాధిపతులను, గురువులను, అమ్మగార్లను, విశ్వాసులను ఆధ్యాత్మికంగా నూతన పరచండి. పేదరికంతో, రోగాలతో, కష్టాలతో బాధపడుతున్న కుటుంబాలను దీవించండి. మా సువార్త ప్రచార కార్యక్రమాలను, విద్యా వైద్య సేవలను, సాంఘిక క్షేమ కార్యక్రమాలను ఆశీర్వదించండి. మా ప్రయత్నాల ద్వారా "మీరే యథార్థ పితయైన దేవుడనియు, మీ కుమారుడైన యేసు క్రీస్తును మీరు ఈ లోకమునకు పంపితిరనియు ఈ ప్రాంత ప్రజలందరూ తెలిసికొందురు గాక!" "నేనే మార్గమును సత్యమును జీవమును" అని పలికిన యేసు ప్రభువా! మీ రక్షణ మార్గంలోకి ఈ ప్రాంత ప్రజలందరినీ నడిపించండి. దారి తప్పిన వారిని తిరిగి మీ మందలోనికి చేర్చండి. ఈ ప్రాంత మందంతట మీ పవిత్ర నామము స్తుతింపబడును గాక. పవిత్రాత్మ దేవా! మీ వరదాన ఫలములతో మమ్ము అభిషేకించండి. మా జీవిత సాక్ష్యం ద్వారా ఆదిలాబాద్ మేత్రాసనములో త్రిత్వైక దేవునికి మహిమ కలుగును గాక! పరిశుద్ధ మరియమ్మా, పునీత జోజప్ప గారా, మా మేత్రాసన పాలక పునీతుడైన పునీత చావర కురియాకోసు గారా, మా కొరకు ప్రార్థించండి.

1. పరలోక జపము 1. మంగళవార్త జపము 1. త్రిత్వస్తోత్రము

# బైబిల్ దృశ్యమాలిక


"అన్య జాతి వీరవనిత"
రూతు
న్యాయాధిపతుల కాలంలో ఇశ్రాయేలు దేశంలో కరువు సంభవించినది. బెత్లెహేము నివాసి ఎలిమెలెకు తన భార్య నయోమితోను, ఇద్దరు పుత్రులు మహలోను, కిల్యోనులతోను మోయాబు దేశానికి వలస వెళ్లాడు. అక్కడ ఎలిమెలెకు చనిపోయాడు. అతని కుమారులు మోయాబు మహిళలు ఓర్పా, రూతులను వివాహమాడారు.
ఈ ఏట మనకు భలే పంటలు పండినాయి.
కెమోషు దేవుని చలవ .........!
ఇక కట్టలు కడదాం.


ఎందుకు మీరు ఆపేస్తున్నారు?
ఈ రోజు కేయోష్ దేవుని పండుగ..
తొలి పంట దేవునికి అర్పించాలి గదా!
ఏమిటీ కేయోష్‌కి సమర్పిసారా? మనకు యెహోవా తప్ప మరొక దేవుడు లేడు.
ఏమి దేవుడు ఈ యెహోవా?
తన భక్తులను పోషించలేని దేవుడు ఒక దేవుడేనా?
?
బాబూ ........... వద్దు ...............
యెహోవా అంత ఘనుడైతే మనం ఎందుకింత దూరం కూటి కోసం రావాలి?
!

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**లూకా సువార్త 13-24 అధ్యాయాలు**

1). ఆవగింజను (13,19)

2). దేవాలయమున (24,53)

3). ద్వేషింతురు (21,17)

4). దేవాలయమున (19,47)

5). న్యాయము (18,8)

6). మొదటి, కడపటి (13,30)

7). సినగోగు (13,10)

8). యేసు (14,2)

9). క్షమింపుము (17,3)

10). కళేబరమున్న (17,36-37)

11). మూలరాయి (20,17)

12). నా మాటలు (21,33)

13). రక్షణ (21,28)

14). జక్కయ్యా (19,5)

15). ఇద్దరు 16,13)

16). దర్శింప (19,44)

17). దేవాలయమునకు (21,38)

18). పరలోకమున (23,43)

19). హేరోదు (23,8)

20). తెర (23,45)

21). ఏనేరము (23,4)

22). నీ విశ్వాసము (18,42)

23). సిలువను (14,27)

24). దేవుని (17,18)

25). భోజనమునకు (22,14)

**వచ్చే నెల పాఠ్యాంశం: యోహాను సువార్త 11-21 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/-

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/-

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/-

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.**

అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్** మాకు పంపించండి

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల - 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com